నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 3 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ తీస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

# రెగ్యులర్ చేసే వరకూ తగ్గేదే లే

● సమగ్ర శిక్షా ఉద్యోగుల స్పష్టం ● జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 2 : తమను రెగ్యులర్ చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 24 వ రోజుకు చేరుకున్నది. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చే వరకూ తగ్గేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రధాన వీధుల గుండా శాంతియుత ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రుతిక, తుకారాం మాట్లాడుతూ 24 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, రెగ్యులర్ చేయడానికి సమయం పడితే అప్పటి వరకు బేసిక్ పే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా నేడు కలెక్టరేట్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మోహన్, తుకారాం, నాగసుధా, రమణ, సంతోష్, పవన్‌కుమార్, నగేశ్, సందీప్, అరుణ, మీనా, కవిత, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలి

● ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలి ● వైద్య విద్యార్థుల డిమాండ్

● ఆసిఫాబాద్‌లోని మెడికల్ కళాశాల ఎదుట ధర్నా

● కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 2 : మెడికల్ కాళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ లేడని, ల్యాబ్‌లో కనీసం పరికరాలు లేవని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా సరిగా తరగతులు జరగడం లేదని, ఇకనైనా స్పందించాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

# నేడు అవుట్ పాసింగ్ పరేడ్

హాజీపూర్, జనవరి 2 : తొమ్మిది నెలల పాటు కఠిన శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల అవుట్ పాసింగ్ పరేడ్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్లు గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన 550 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకొని అవుట్ పాసింగ్ పరేడ్‌కు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఆయుధ శిక్షణతో పాటు చట్టం, నేర పరిశోధన, ఫిజికల్ ఫిట్‌నెస్, సాంకేతిక విద్య, పరుగు పందెం, కరాటే, యోగా, మ్యాప్ రీడింగ్, వాహనాలు నడుపడం తదితర అంశాలతో పాటు మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసంలో కానిస్టేబుళ్లు పూర్తి స్థాయి నైపుణ్యాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కమార్ దీపక్ ముఖ్య అతిథిగా హాజరవుతుండగా, అతిథులుగా మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ పాల్గొననున్నట్లు తెలిపారు.

# ఉత్తమ ఫలితాలు సాధించాలి

కన్నెపల్లి, జనవరి 2 : వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, రాష్ట్రస్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కన్నెపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వంట గది, తరగతి గదులు, ఆర్వో ప్లాంట్ , నూతన మెనూ పట్టిక, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

# గిరిజనులకు అండగా ఉంటాం

కెరమెరి, జనవరి 2: గిరిజనులకు అండగా ఉంటామని ఆసిఫాబాద్ జిల్లా ఏఎ స్పీ చిత్తరంజన్ అన్నారు. గురువారం మండలంలోని జోడేఘాట్‌ను సందర్శించారు. ఆదివాసుల ఆరాధ్య దైవం కుమ్రం భీంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మ్యూజియానికి వెళ్లి ప్రతిమలను పరిశీలించారు. మ్యూజియం రికార్డు అసిస్టెంట్‌కు మ్రంగంగును భీం చేసిన పోరాటం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలకు వసతులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అత్యంత మారుమూల ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తారని తెలిపారు. అనంతరం కెరమెరి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. భీం ఉత్సవ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ విజయ్, సిబ్బంది ఉన్నారు.



కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

# ఎమ్మెల్యే కోవ లక్ష్మికి శుభాకాంక్షల వెల్లువ

రెబ్బెన, జనవరి 2 : జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని గురువారం రెబ్బెన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, మాజీ సర్పంచ్ తోట లక్ష్మణ్, నాయకులు పొతిరెడ్డి, దామోదర్, ప్రభాకర్, వడ్డె పోచం, శారద ఉన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత**

జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కొండపల్లి, కిష్టాపూర్, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు దామోదర్, పొతిరెడ్డి, ప్రభాకర్, పోచం, తదితరులు ఉన్నారు.



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

# వేతన వ్యథ

## మెప్మా ఆర్పీలకు ఏడు నెలలుగా అందని వేతనాలు

● ఇటీవల ఇందిరా పార్కు వద్ద ధర్నా

● ఇప్పటికీ స్పందించని సర్కారు

● కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్న రిసోర్స్‌పర్సన్లు



మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

మంచిర్యాల టౌన్, జనవరి 2 : జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లకు ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా అందుకు తగ్గట్లుగా జీతాలు ఇవ్వడం లేదని, ప్రస్తుతమిచ్చే వేతనం కూడా సకాలంలో అందక కుటుంబ పోషణకు అవస్థలు పడాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లా వ్యాప్తంగా 350 మంది..**

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు మున్సిపాలిటీల్లో దాదాపు 350 మంది వరకు ఆర్పీలు పనిచేస్తున్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడం, వారి ఆర్థిక పరిపుష్టికి తోడ్పాటును అందించడం, ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో వీరిది కీలక పాత్ర. ప్రభుత్వ సమావేశాలకు మహిళలను తరలించడంలోనూ ఆర్పీలు ప్రధాన భూమిక పోషిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనులు చేస్తున్నా అందుకు తగ్గట్లుగా వేతనాలు అందించకపోవడంపై తీవ్ర వేదనకు గురవుతున్నారు.

**ఏడు నెలలుగా అందని వేతనాలు**

ఆర్పీలకు ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఈ విషయమై అనేకసార్లు ఆందోళనలు చేపట్టడంతో పాటు మెప్మా పీడీతో పాటు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇటీవల హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా సైతం నిర్వహించారు. ఏళ్లుగా మెప్మాలో పని చేస్తున్న ఆర్పీలు దాదాపు మొదటి ఐదేండ్లు ఉచితంగానే సేవలు అందించారు. ఆ తర్వాత ఏడాదికి రూ. 7200 ప్రభుత్వం నుంచి అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొదట ఆర్పీలకు నెలకు రూ. 4 వేల గౌరవ వేతనం అందించారు. ఆపై రూ. 2 వేలు పెంచి రూ. 6 వేల చొప్పున అందించారు. ఇచ్చేది తక్కువ వేతనమే అయినా.. అది కూడా ఏడు నెలలుగా అందించకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

### వేతనం రూ. 20 వేలు ఇవ్వాలి

మాకు వేతనాలివ్వక ఏడు నెలలు అవుతుంది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆందోళనలు చేస్తే మున్సిపాలిటీల నుంచి వేతనాలు ఇస్తామని చెప్పారు. ఇప్పటికీ ఇచ్చింది లేదు. ఆర్పీలకు కనీస గౌరవ వేతనం రూ. 20 వేలు ఇవ్వాలి. హామీలు ఇస్తున్నారే తప్ప అమలు చేయడం లేదు. ఇకనైనా మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సర్కారు స్పందించాలి.

- మంగ, ఆర్పీ, మంచిర్యాల





### సర్కారు స్పందించాలి

ఏడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే వేతనాలు మంజూరు చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. రాష్ట్ర సర్కారు వెంటనే స్పందించాలి. వేతనం పెంచడంతో పాటు పీఆర్సీని అమలు చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరకమైన డ్రెస్‌కోడ్ అమలు చేయాలి. మరణించిన ఆర్పీల కుటుంబాలకు ప్రత్యేక సాయమందించాలి.

- జ్యోతి, ఆర్పీ, మంచిర్యాల



ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ధర్నాలో ఆర్పీలు



అధికారులతో మాట్లాడుతున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

# ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేద్దాం

● రామగుండం సీపీ శ్రీనివాస్ ● ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష

మంచిర్యాల అర్బన్, జనవరి 2 : ఎప్పటిలాగే ఈ యేడాది కూడా చేపడుతున్న ఆపరేషన్ స్మైల్ – 11 కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం రామగుండం కమిషనరేట్‌లో ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ పిల్లలు క్షణికావేషంలో తల్లిదండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారని, దీనినే ఆసరాగా తీసుకొని కొందరు వారి జీవితాలతో ఆడుకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన పిల్లలను దర్పణ్ అప్లికేషన్ ద్వారా గుర్తించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి.. తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని చెప్పారు. భిక్షాటన చేస్తున్న వారి గురించి, బాలకార్మికుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్‌లైన్‌కు చెందిన 1098,112 నంబర్ల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ డివిజన్ స్థాయిలో సబ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు మహిళా పోలీస్ అధికారి, నలుగురు సిబ్బంది, వివిధ డిపార్టుమెంట్‌ల అధికారులు కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించాలని పేర్కొన్నారు.

# బాలకార్మికులను గుర్తించాలి

**ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు**

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 2 : బాల కార్మికులను గుర్తించి వారికి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనవరి 31వ తేదీ వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పోలీసు, మహిళా అభివృధి, శిశు సంక్షేమం, కార్మిక, విద్య ఆరోగ్యశాఖలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్,ఎన్‌జీవో అ ధికారులతో కలిసి రెండు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. బాల కార్మికుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్లు 1098,112 గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్‌రావు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేశ్, డీఎంహెచ్‌వో సీతారాం, డీఈవో యాదయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

# బడీడు పిల్లల సర్వే ఎప్పుడో!

## సమ్మెలో సీఆర్పీలు.. ఇక ఇప్పట్లో లేనట్లేనా..

దండేపల్లి, జనవరి 2 : బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా చేపట్టాల్సిన గుర్తింపు సర్వే నిలిచిపోయింది. సీఆర్పీలు సమ్మెలో ఉండగా, డిసెంబర్ 12న ప్రారంభించాల్సిన సర్వే నేటికీ మొదలు కాలేదు. సర్కారు స్పందిస్తేగాని ఉద్యోగులు ఆందోళన విరమించే పరిస్థితి కనిపించకపోవడంతో ఇక ఇప్పట్లో సర్వే చేయడం కష్టమేనని స్పష్టమవుతున్నది..

**డిసెంబర్ 12 నుంచే..**

గడిచిన యేడాది డిసెంబర్12 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు పాఠశాలలకు రాని పిల్లలను గుర్తించేందుకు సర్వే చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రతి పాఠశాలలో నెల కంటే ఎక్కువ గైర్హాజరైన విద్యార్థులతో పాటు 15–19 ఏళ్లలోపు కళాశాల స్థాయి విద్యార్థులను గుర్తించి జాబితా రూపొందించాల్సి ఉంది. విద్యాశాఖలో పనిచేసే సీఆర్పీలు క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేయాల్సి ఉంది. వీరికి ఉపాధ్యాయులు, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, విశ్రాంత ఉద్యోగులు, యువజన సంఘాలు, పంచాయతీ కార్యదర్శులు సహకరించనున్నారు. సర్వే సమయంలో గుర్తించిన పిల్లల్లో దివ్యాంగులుంటే వారిని ఐఆర్‌పీల(ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)కు అప్పగించాలని నిర్ణయించారు. పిల్లల వివరాలు సేకరించిన తర్వాత ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేసి పాఠశాల స్థాయి వారిని సమీప పాఠశాలల్లో చేర్పించాలి. అలాగే కళాశాల స్థాయి వారికి విద్య వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసి ఓపెన్ ఎడ్యుకేషన్ విధానం ద్వారా చదువుకునేందుకు ప్రోత్సహించాల్సి ఉంది.

**సమ్మెతో నిలిచిన సర్వే**

గతంలో జిల్లాలోని 18 మండలాల్లో ఉన్న 51 క్లస్టర్లలో 41 మంది సీఆర్పీలు, 20 మంది ఐఈఆర్పీలు సర్వే చేశారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు 86 మందిని.. 15 నుంచి 19 యేళ్లలోపు 117 మందిని గుర్తించారు. ఈసారి ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో బడి బయట పిల్లలను గుర్తించే సర్వే నిలిచిపోయింది. ప్రస్తుతం జిల్లాలోని 42 మంది సీఆర్పీలు, 29మంది ఐఈఆర్పీలు, ఏడుగురు డీఈవో కార్యాలయ సిబ్బంది, 16 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కో ఆర్డినేటర్లు 16 మంది, 12 మంది మెస్సేంజర్లు, 18 మంది కేర్ గీవర్స్, 18 మంది కేజీబీవీ ఎస్‌వోలు, 187 మంది బోధనా సిబ్బంది, 179 మంది బోధనేతర సిబ్బంది, 65 మంది ఉన్నత పాఠశాలల ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లు సమ్మెలో పాల్గొంటున్నారు.

**హామీ మరిచిన సర్కారు**

సమగ్ర శిక్షా అభియాన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమను రెగ్యులర్ చేయాలని యేడాది క్రితం సమ్మె చేశారు. అప్పట్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొలువుదీరి యేడాది గడుస్తున్నా హామీ నెరవేరకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది సమ్మె బాట పట్టారు. గతేడాది డిసెంబర్ 10 నుంచి సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అని వేచి చూస్తున్నారు.



నిరవధిక సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు



బడి బయటి పిల్లలను గుర్తించిన సీఆర్పీ(ఫైల్)

# మెనూ ప్రకారం భోజనమందించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే**

వాంకిడి, జనవరి 2 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనమందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. గురువారం బంబార బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. వంట గది, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహ పరిసర ప్రాంతాలతో పాటు వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే